క్లుప్తంగా

అల్లూరులో భారీ వర్షం



అల్లూరు: మండలంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సాయంత్ర వేళ వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకున్నాయి. ఆకాశం మేఘావృతమై ఈదురుగాలులతో భారీ వర్షం పడింది. వర్షంతో ద్విచక్ర వాహనచోదకులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

వరద బాధితులకు విరాళం



అల్లూరు: నగర పంచాయతీ పరిధిలోని విక్రమ్ స్కూల్ విద్యార్థులు తమ మానవత్వాన్ని చాటుకున్నారు. విజయవాడ వరద బాధితుల కోసం విరాళాల ద్వారా రూ.36వేలు సేకరించి స్కూల్ కరస్పాండెంట్ వంశీకి శుక్రవారం అందజేశారు. ఆయన అపస్మా ప్రెసిడెంట్ శివకుమార్, ట్రెజరర్ రాధాకృష్ణకు అందజేశారు.

ఎస్సై బాధ్యతల స్వీకరణ



ఆత్మకూరు: ఆత్మకూరు పోలీసు స్టేషన్ ఎస్సైగా సాయిప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో ఆత్మకూరు స్టేషన్‌లో ఏఎస్సైగా, ఎస్సైగా విధులు నిర్వహించారు. ఎన్నికలకు ముందు బదిలీ అయ్యారు. నూతన ఎస్సైకు స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

విందు భోజనం

వింజమూరు(ఉదయగిరి): శుభ్‌దిన్ కార్యక్రమంలో భాగంగా వింజమూరులోని పాతూరు ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ఉపాధ్యాయుడు జూపల్లి వెంకటేశ్వరరావు శుక్రవారం విందు భోజనం ఏర్పాటు చేశారు. హెచ్ఎం వెంకటసుబ్బారెడ్డి, కొండారెడ్డి, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక, కంకర అక్రమ తరలింపు

కావలి: పట్టణంలోని బుడంగుంట, ముసునూరులోని జగనన్న కాలనీ లేఅవుట్లలోని ఇసుక, కంకరను కొందరు అక్రమార్కులు దొంగతనంగా తరలించుకుపోతున్నారు. ప్రసుత్తం గృహ నిర్మాణ పనులు సాగకపోవడంతో పెద్ద ఎత్తున ఇసుక, కంకర నిల్వలు ఉన్నాయి. ఈ నిల్వలపై కన్నేసిన అక్రమార్కుల రాత్రి వేళ దర్జాగా తరలించుకుపోయి సొమ్ము చేసుకుంటున్నారు.

టీడీపీ వర్గీయుల నడుమ ఘర్షణ

పరస్పరం పోలీసులకు ఫిర్యాదులు

సోమశిల: మండలంలోని మంచాలపల్లి జంగాలకాలనీలో టీడీపీ వర్గీయుల నడుమ రెండ్రోజుల క్రితం ఘర్షణ నెలకొంది. రోడ్డు మీదకు మురుగునీరు వచ్చిన విషయమై కొమ్మూరు అంజయ్య, నీలం అంజయ్య వర్గాల మధ్యన నెలకొన్న వివాదం ఘర్షణకు దారితీసింది. ఇరువర్గాల వారు పరస్పరం దాడులకు చేసుకున్నారు. అనంతరం పరస్పరం పోలీసులకు ఫిర్యాదులు చేశారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక ఫలసాయం



అవగాహన కల్పిస్తున్న డీ మాలకొండయ్య

ఆత్మకూరురూరల్: ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా రైతులు అధిక ఫలసాయాన్ని పొందవచ్చునని ఏబీసీఎంఎఫ్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ డీ మాలకొండయ్య పేర్కొన్నారు. ఆత్మకూరు సబ్‌డివిజన్ పరిధిలోని రైతుసేవా కేంద్రాల సహాయకులకు ప్రకృతి వ్యవసాయ విధానాలపై శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాలకొండయ్య ముఖ్యఅతిథిగా హాజరై ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. పంటల సాగులో ఘన జీవామృతం, ధృవ జీవామృతం, బీజామృతాన్ని వినియోగించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మారుతి దేవి, పొదలకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త సురేఖ, ఉద్యానశాఖ అధికారిణి లక్ష్మి, ఆత్మకూరు ఉద్యాన శాఖ అధికారి రాజశేఖర్‌రెడ్డి పంటల సాగులో రైతులు పాటించాల్సిన మెలకువలను వివరించారు. ఏఓలు కిషోర్‌బాబు, శ్రీధర్‌రెడ్డి, రజనీ, డీఆర్పీ ఏఓ నీరజాకుమారి, తదితరులు పాల్గొన్నారు.

హామీలు నీటి బుడగలేనా?

ఎన్నికల వేళ మోసపూరిత హామీలు

- అధికారంలోకి వచ్చాక ప్రజల ఆశలపై నీళ్లు
- హామీల అమలుపై దృష్టి సారించని కూటమి ఎమ్మెల్యేలు
- వందరోజుల పాలనపై ఆర్భాటపు ప్రచారం

ఎన్నికల వేళ అంతన్నారు..ఇంతన్నారు..మోసపూరిత హామీలను గుప్పించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని బీరాలు పలికారు. తీరా అధికారంలోకి వచ్చాక కూటమి ఎమ్మెల్యేలు ప్రజలను వంచించారు. హామీల అమలుపై దృష్టి సారించలేదు. కనీసం వాటిపై సమీక్షించి కార్యాచరణలను రూపొందించిన దాఖలాలు లేవు. అయినా వందరోజుల పాలనపై 'మంచి ప్రభుత్వం' అంటూ ఆర్భాటపు ప్రచారం ప్రారంభించడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు.

కావలి: గత ఎన్నికల సమయంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి హామీల జల్లుకురిపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కావలి నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానని హామీ ఇచ్చారు. అయితే టీడీపీ అధికారంలోకి వచ్చి వంద రోజులు గడుస్తున్నా హామీలు అమలుకు నోచుకోలేదు. ఇప్పటి వరకు ఇచ్చిన హామీల్లో కావలి–తుమ్మలపెంట రోడ్డు నిర్మాణ పనులను మాత్రమే ప్రారంభించారు.

ఇచ్చిన హామీలు

- రూ.55 కోట్లతో చేపడుతున్న కావలిలోని ట్రంక్ రోడ్డు విస్తరణ పనులు పూర్తి.
- కావలిలోని ఒంగోలు బస్టాండ్ సెంటర్‌లో అన్న క్యాంటీన్ ఏర్పాటు.
- ఉదయగిరి రోడ్డులోని క్రీడా శాఖకు సంబంధించిన 9.5 ఎకరాల స్థలంలో స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణం.
- కావలిలోని కళుగోళమ్మ గుడి వద్ద రైల్వే ట్రాక్‌పై ఫ్లయిఓవర్ బ్రిడ్జి నిర్మాణం.
- కావలిలో మంచినీటి పథకం నిర్మాణ పనులు పూర్తి చేసి ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీరు అందించడం.
- గ్రామాల్లోని ప్రతి ఇంటికి కుళాయిల ద్వారా స్వచ్ఛమైన తాగునీటి సరఫరా.
- కావలిలో రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు
- కావలి మండలంలోని చివరి ఆయకట్టు భూములకు సోమశిల జలాలను అందించడం.
- కావలి మండలంలోని పడమటి గ్రామాల చెరువులకు లిఫ్ట్ ద్వారా సోమశిల జలాలను అందించడం .
- కావలిలోని మందాటి చెరువు వద్ద పది ఎకరాల్లో ముస్లింలకు శ్మశానవాటిక నిర్మాణం.
- మద్దూరుపాడులోని టిడ్కో ఇళ్ల వద్ద మౌలిక వసతులు కల్పించడం.
- కావలి పట్టణంలో బాబు జగ్జీవన్ రామ్ భవన నిర్మాణం.
- కావలిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన నిర్మాణం.



కావలిలోని క్రీడాశాఖకు చెందిన స్థలం

- కావలిలోని ముస్లిం మైనార్టీలకు కమ్యూనిటీ హాల్ నిర్మాణం.
- కావలిలో ఉర్దూ అర్బన్ స్కూల్ నిర్మాణం.
- యువత కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు.
- కావలిలో మురుగునీటి శుద్ధి ప్లాంట్ నిర్మాణ చేపట్టి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం.
- కావలిలోని మందాటి చెరువును మంచినీటి రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయడం.
- కావలిలోని ఉదయగిరిరోడ్డును కలుపుతూ ముసునూరు, మద్దూరుపాడుల వైపు నుంచి రింగ్ రోడ్డు నిర్మాణం.
- తీరప్రాంతంలో మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లడానికి అనువుగా రోడ్ల నిర్మాణం.
- ఎమ్మెల్యేగా మొట్టమొదటి లెటర్ ప్యాడ్‌ను జర్నలిస్టుల సంక్షేమం కోసమే వినియోగిస్తానని హామీ.
- దామవరం విమానాశ్రయ నిర్మాణ పనుల ప్రారంభం.
- పరిశ్రమల స్థాపన ద్వారా యువతకు ఉపాధి అవకాశాల కల్పన.
- విద్యుత్ లోఓల్టేజీ సమస్యల పరిష్కారానికి సబ్ స్టేషన్ల నిర్మాణం.

కార్యాచరణపై దృష్టి ఏదీ?

ఉదయగిరి: ఎన్నికల సమయంలో టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే ఉదయగిరి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ విస్తృత ప్రచారం చేశారు. తన ట్రస్టు ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలతో పాటు ప్రభుత్వ నిధులతో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానని హామీ ఇచ్చారు. సీఎం చంద్రబాబు సైతం ఎన్నికల ప్రచారంలో భాగంగా మార్చి 29న వింజమూరులో జరిగిన బహిరంగ సభలో పలు హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చి వంద రోజులు గడిచినా హామీలు అమలుకు నోచుకోలేదు. ఉదయగిరి నియోజకవర్గ వ్యాప్తంగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. వచ్చే నెలలో వర్షాలు పడకపోతే తాగునీటి సమస్య మరింత జటిలం కానుంది. గత ప్రభుత్వ హయాంలో కలిగిరి పెద్ద చెరువు అభివృద్ధికి 'గ్రామకొలను' పథకం ద్వారా నిధులు మంజూరయ్యాయి. రూ.50 లక్షల మేర పనులు కూడా జరిగాయి. ఇటీవల అవే పనులకు మళ్లీ ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేయడం తప్ప చేసింది ఏమీ లేదు. ఇప్పటి వరకు కనీసం హామీల అమలుపై సమీక్షించి కార్యాచరణను కూడా రూపొందించకపోవడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు.



ఉదయగిరి ట్యాంకు బండ్ నిర్మాణం (ఫైల్)

ఇచ్చిన హామీలు

- తాగు, సాగునీటి సమస్యల పరిష్కారం.
- వింజమూరులో సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు నిర్మాణం.
- పరిశ్రమల స్థాపన ద్వారా నిరుద్యోగ సమస్యకు పరిష్కారం.
- ఉదయగిరిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి.
- పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ పనులు సత్వరమే పూర్తి.
- సీతారామసాగర్, సోమశిల హైలెవల్ కెనాల్స్‌నిర్మాణం.
- ఉదయగిరిలో పాలిటెక్నిక్ కళాశాల నిర్మాణం.

మాటలకే పరిమితం

ఆత్మకూరు: ఎన్నికలకు ముందు టీడీపీ కూటమి నాయకులు హామీలను గుప్పించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే హామీలను నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి వంద రోజులు గడిచినా కక్ష పూరిత రాజకీయాలకు ప్రాధాన్యం ఇవ్వడం మినహా హామీలను నెరవేర్చకపోవడం.. ఆ దిశగా కార్యాచరణ కూడా చేపట్టకపోవడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఎన్నికలకు ముందు ప్రజాగళం పాదయాత్రలో భాగంగా ఆత్మకూరు నియోజకవర్గంలో పర్యటించిన లోకేశ్ నిరుద్యోగులతో సమావేశమయ్యారు. అధికారంలోకి రాగానే ఉద్యోగాలు కల్పిస్తాం..నిరుద్యోగ భృతి మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా సోమశిల జలాశయం ముంపు బాధిత కుటుంబాలతో సమావేశమైన ఆయన తాము అధికారంలోకి రాగానే అర్హులందరికీ ఉద్యోగాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఆ దిశగా చొరవ చూపకపోవడంపై బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆత్మకూరులో పర్యటించిన చంద్రబాబు అధికారంలోకి రాగానే సోమశిల జలాశయాన్ని పూర్తి స్థాయిలో పటిష్ట పరుస్తామని, హైలెవల్ కెనాల్ పనులు రెండు దశల్లో వేగవంతంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఆ దిశగా కార్యాచరణ చేపట్టకపోవడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ ఉత్తర, దక్షిణ కాలువలను పూర్తి స్థాయిలో అభివృద్ధి పరిచి చివరి ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. రబీ సీజన్ వస్తున్నా ఇప్పటి వరకు కాలువల అభివృద్ధికి చర్యలు చేపట్టకపోవడంపై రైతులు ప్రశ్నిస్తున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం

- కార్డన్ సెర్చ్‌లో సరైన పత్రాలు లేని 40 బైకులు, 4 ఆటోలు స్వాధీనం
- కావలి డీఎస్పీ పీ శ్రీధర్

కావలి: పట్టణంలోని ఇందిరానగర్, తుఫాన్‌నగర్, బాలకృష్ణారెడ్డినగర్, తదితర ప్రాంతాల్లో పోలీసులు కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌ను శుక్రవారం నిర్వహించారు. ఎస్పీ శ్రీకాంత్ ఆదేశాల మేరకు కావలి డీఎస్పీ పీ శ్రీధర్ ఆధ్వర్యంలో కావలి టూ టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బందితో కలిపి సుమారు 90 మంది ఆపరేషన్‌లో పాల్గొని ఇంటింటిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ, చట్టవ్యతిరేక కార్యకలాపాలను నిరోధించడం, దొంగతనాల నివారణ, అసాంఘీక శక్తుల కట్టడే లక్ష్యంగా కార్డన్ సెర్చ్ చేపట్టినట్లు తెలిపారు. సుమారు 1500 ఇళ్లను తనిఖీ చేసినట్లు చెప్పారు. సరైన పత్రాలు లేని 40 బైకులు, 4 ఆటోలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. 20 మంది రౌడీ షీటర్లు/సస్పెక్ట్ షీటర్ల ఇళ్లను తనిఖీ చేసినట్లు తెలిపారు.



బైక్ పత్రాలను పరిశీలిస్తున్న పోలీసులు

రైతులకు మొక్కల పంపిణీ

మర్రిపాడు: మండలంలోని ఖాదర్‌పూర్‌లో ఐటీసీ సెర్ప్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రైతులకు శుక్రవారం మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవా సంస్థ సిబ్బంది ధనుంజయ, ప్రకాష్ మాట్లాడుతూ ఐటీసీ ఆధ్వర్యంలో రైతుల సంక్షేమానికి పలు కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. అందులో భాగంగా గతేడాది ఫారమ్‌పాండ్స్, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం రైతులకు మామిడి, నేరేడు, జామ, ఉసిరి, కానుగ, వేప, మర్రి, తదితర మొక్కలను పంపిణీ చేస్తున్నామని వివరించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐటీసీ అధికారి శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



ప్లాస్టిక్ ముప్పు

ప్లాస్టిక్.. నిత్యజీవితంలో భాగమైంది. ప్రతిఒక్కరూ ఏదోక రూపంలో వినియోగిస్తున్నారు. పర్యావరణానికి ముప్పును కలిగించడంతో పాటు కేన్సర్ బారిన పడుతున్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావడం ద్వారా ఈ ముప్పును అధిగమించవచ్చు. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆత్మకూరురూరల్: ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోంది. ప్రజలు విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తుండడంతో గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా వీధులు, మురుగు కాలువలు, వాగులు, వంకల్లో సైతం ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఈ వ్యర్థాలు మానవ మనుగడకు, పర్యావరణానికి తీవ్రమైన చేటును కలుగజేస్తున్నాయి. 120 మైక్రాన్లలోపు మందం గల ప్లాస్టిక్ కవర్లను వినియోగించరాదంటూ 2022 జూలై 1న ప్రభుత్వం చట్టం చేసినప్పటికీ ఆచరణలో సరైన పురోగతి కానరావడంలేదు. సంబంధిత శాఖల అధికారులతో పాటు సామాన్య ప్రజలు సైతం పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తుండడంతో సమస్య మరింత జటిలంగా మారుతోంది. ప్లాస్టిక్ వాడకం, మద్యపానం, ధూమపానం కంటే మరింత ప్రమాదకరమైనదని పర్యావరణహితులు హెచ్చరిస్తున్నారు. అయితే ఈ విషయమై ప్రజల్లో అవసరమైన మేర అవగాహన కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందనే వాదన ఉంది. కనీసం సామాజిక మాధ్యమాల్లో ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాలను ప్రజలకు అర్థమయ్యేలా ప్రచారం చేస్తే ఉపయోగం ఉంటుందని పలువురు భావిస్తున్నారు. సిగిరెట్ ప్యాకెట్లపై ఆరోగ్యానికి హానికరం అని ముద్రించినట్లుగానే ప్లాస్టిక్ సంచులపై ప్లాస్టిక్ వాడకం ప్రాణాంతకం అని ముద్రిస్తే వినియోగదారుల్లో కొంచమైన ఆలోచన కలిగే అవకాశం ఉంది.


స్వచ్ఛతా హీ సేవ సత్ఫలితాలను ఇచ్చేనా?

పల్లెలు, పట్టణాల్లో పారిశుధ్యం మెరుగునకు ప్రభుత్వం ఈ నెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు స్వచ్ఛతా హీ సేవ పేరుతో కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అందులో భాగంగా తొలిరోజు గ్రామాల్లో అవగాహన ర్యాలీలు, మానవహారాలు, 18న మొక్కలు నాటడం, 19న పరిసరాల పరిశుభ్రతపై ఇంటింటికి తిరిగి అవగాహన, 20న పాఠశాలల్లో విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన, 21న విద్యార్థులకు వ్యాసరచన పోటీల నిర్వహణ, 22న సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం, 25న పారిశుద్య కార్మికుల సంక్షేమంపై చర్చ, 30న హోటళ్లలో పారిశుద్యం అమలు తీరును పరిశీలించి చర్యలు తీసుకోవడం, అక్టోబరు 2న పారిశుద్య కార్మికులను సత్కరించడం, తదితర కార్యక్రమాలను చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే పరిసరాల శుభ్రత, ప్లాస్టిక్ వ్యర్థాలపై ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన అధికారులు మొక్కుబడిగా కార్యక్రమాలను నిర్వహిస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



ఆత్మకూరు ఆర్టీసీ డిపో సమీపంలో పేరుకుపోయిన డ్రైనేజీలో ప్లాస్టిక్ వ్యర్థాలు

ప్రజల్లో చైతన్యం తేవాలి



ధూమపానం, మద్యపానం ఆరోగ్యానికి హానికరం అంటూ ప్రసార మాధ్యమాల ద్వారా ప్రభుత్వ ప్రచారం చేస్తోంది. అదే విధంగానే ప్లాస్టిక్‌తో తలెత్తే అనర్థాలపై విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి. జిల్లా జనవిజ్ఞాన వేదిక తరుపున తమ వంతుగా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ప్లాస్టిక్‌ను నిషేధిస్తే పర్యావరణ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

– హనుమంతు మురళీకృష్ణ, జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మర్రిపాడు: మండలంలోని సోమశిల ఉత్తరకాలువ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. వివరాలు.. మండలంలోని రామానాయుడుపల్లికి చెందిన పరిమి గోవిందయ్య తన సొంత పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై నందవరం నుంచి డీసీపల్లికి వస్తున్న క్రమంలో ఉత్తరకాలువ వద్ద అకస్మాత్తుగా పంది అడ్డు వచ్చింది. దీంతో పందిని తగిలి ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోవడంతో గోవిందయ్య తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని హైవే అంబులెన్స్‌లో ఆత్మకూరులోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పీఎం విశ్వకర్మపై అవగాహన

ఉదయగిరి: స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో పీఎం విశ్వకర్మ పథకంపై లబ్ధిదారులకు ఏపీజీబీ జిల్లా చీఫ్ మేనేజర్ ఆంజనేయులు శుక్రవారం అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం పీఎం విశ్వకర్మ పథకం కింద చేతివృత్తిదారులకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. రుణాలను సకాలంలో తిరిగి చెల్లిస్తే రెట్టింపు మొత్తాన్ని అందజేయనున్నట్లు చెప్పారు. చేతివృత్తిదారులు సద్వినియోగం చేసుకుని జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి రుణాలు అందజేస్తామని తెలిపారు స్థానిక బ్యాంకు మేనేజర్ మురళి పాల్గొన్నారు.

స్వచ్ఛ మున్సిపాలిటీకి సహకరించాలి

ఆత్మకూరు: స్వచ్ఛ మున్సిపాలిటీకి ప్రజలు సహకరించాలని కమిషనర్ గంగా ప్రసాద్ కోరారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో 5కే రన్‌ను శుక్రవారం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నుంచి నెల్లూరు పాళెం వరకు 5కే రన్‌ను నిర్వహించారు. మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లు, యువకులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం మెరుగునకు ప్రతిఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ ఏఈలు జే ప్రసాద్, వరలక్ష్మి, మెప్మా సిబ్బంది మాధవి, మహిళా నాయకురాలు పులిమి శైలజ, తదితరులు పాల్గొన్నారు.



5కే రన్‌ను ప్రారంభిస్తున్న కమిషనర్ గంగా ప్రసాద్

ఉదయగిరి ఆనకట్ట పరిశీలన

ఉదయగిరి: ఉదయగిరి ఆనకట్ట పనులు మధ్యంతరంగా ఆగిపోయిన క్రమంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శుక్రవారం పరిశీలించారు. పనుల పురోగతిని ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. ఉదయగిరి ఆనకట్ట పనులను త్వరగా పూర్తిచేయిస్తామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉదయగిరికి సాగు, తాగునీటి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఉదయగిరి కోటను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధికి పార్టీలకతీతంగా ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. అలాగే దాసరపల్లిలో 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో చేపట్టిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి వంద రోజుల్లో ప్రభుత్వం సాధించిన అభివృద్ధి పేరుతో స్టిక్కర్లను అంటించారు. టీడీపీ నాయకులు బయ్యన్న, రియాజ్, చెంచలబాబుయాదవ్, ఓబుల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఉదయగిరి ఆనకట్టను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

హోరాహోరీగా స్కూల్ గేమ్స్



ఉదయగిరి: గండిపాళెం గురుకులంలో షాట్‌పుట్ విసురుతున్న విద్యార్థి



ఉదయగిరి: నియోజకవర్గస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన బాలికల జట్టు



సోమశిల: వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం గురుకుల పాఠశాలలో మండలస్థాయి స్కూల్ గేమ్స్ శుక్రవారం ప్రారంభమయ్యాయి. మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన 85 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. రెండ్రోజుల పాటు నిర్వహించే పోటీల్లో భాగంగా తొలిరోజు అథ్లెటిక్స్ నిర్వహించారు. ప్రతిభకనబరిచిన వారిని నియోజకవర్గస్థాయికి ఎంపిక చేశారు. శనివారం మిగిలిన క్రీడలకు సంబంధించిన పోటీలను నిర్వహించనున్నారు. ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీడీ జీడీ సురేష్ పోటీలను పర్యవేక్షించారు. గురుకులం ప్రిన్సిపల్ జే పుష్పరాజ్, పీడీలు నైమా, వాసు, హెచ్ఎం వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

–వింజమూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో రెండోరోజు కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, యోగా పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారిని నియోజకవర్గస్థాయికి ఎంపిక చేశారు. శనివారం వాలీబాల్, ఖోఖో, చెస్ పోటీలకు సంబంధించిన ఎంపికలు నిర్వహించనున్నారు. పీడీలు ఎస్ ప్రభాకర్‌రెడ్డి, ఎం తిరుపాల్‌రెడ్డి, వీ కృష్ణ, ఆర్ అంజయ్య, రజని, విలాసిని, సుమలత, మాచర్ల, తదితరులు పాల్గొన్నారు.

సోమశిల: అనంతసాగరం మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు రేవూరు ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. రెండ్రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ పోటీలను హెచ్ఎం వెంకటేశ్వర్లు రెడ్డి ప్రారంభించారు. తొలిరోజు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, లాంగ్‌జంప్, షాట్‌పుట్ పోటీలను నిర్వహించినట్లు పీడీ గౌరిరెడ్డి తెలిపారు. పీడీలు, పీఈటీలు ఎం శ్రీనివాసులు, రమేష్, మీరావళి, నాగమోహన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సీతారామపురం: మండల స్థాయి స్కూల్‌గేమ్స్ అయ్యవారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. సీతారామపురం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాసులు పోటీలను ప్రారంభించారు. తొలిరోజు అండర్–14, 17 విభాగాల్లో అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. శనివారం క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మండల స్థాయి స్కూల్ గేమ్స్‌లో భాగంగా రెండో రోజు వాలీబాల్, ఖోఖో, చెస్, యోగా, కబడ్డీ, తదితర క్రీడా పోటీలను నిర్వహించారు. పీడీలు తిరుపతయ్య, సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మండల స్థాయి పోటీలకు 250 మందికిపైగా విద్యార్థులు హాజరుకాగా, 102 మంది నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ తిరుపతయ్య తెలిపారు. హెచ్ఎం అనంత లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సీతారామపురం: ఆటల పోటీలను ప్రారంభిస్తున్న హెచ్ఎం శ్రీనివాసులు



ఆత్మకూరు ఉన్నత పాఠశాలలో జూనియర్ బాలికల కబడ్డీ పోటీలు